

ఏప్రిల్ 23, 2008
హైదరాబాద్

# టెక్సాస్ తెలుగు సంఘం వారి తెలుగు సాహిత్య వేదిక 'నెల నెలా తెలుగు వెన్నెల' తొమ్మిదవ సమావేశం

ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం వారి తెలుగు సాహిత్య వేదిక నిర్వహించే 'నెల నెలా తెలుగు వెన్నెల' తొమ్మిదవ సమావేశం నేడు డల్లాస్ నగరంలోని హిందూ దేవాలయంలో జరిగింది. పెక్కు తెలుగు సాహితీ ప్రియులు ఆహూతులైన ఈ సభకి సాహిత్య వేదిక కన్వీనర్, తానా కార్యదర్శి ప్రసాద్ తోటకూర అధ్యక్షత వహించారు. భారతదేశం నుండి అమెరికా పర్యటనకు వచ్చిన ప్రముఖ రచయిత్రి, ఆంధ్ర మహిళా సభ మహిళా కళాశాల రిటైర్డ్ రీడర్ డాక్టర్ నిడమర్తి నిర్మలాదేవి ప్రధాన వక్తగా 'కృష్ణ శాస్త్రి – సాహితీ సౌరభం' అనే అంశంపై ప్రసంగించిన ఈ కార్యక్రమంలో న్యూజెర్సీ అసెంబ్లీ సభ్యుడు చివుకుల ఉపేంద్ర విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. సాహిత్య వేదిక తరపున ప్రసాద్ తోటకూర అతిథులకు, వేదిక సభ్యులకు స్వాగతం పలికిన పిదప, చివుకుల ఉపేంద్ర ప్రసంగిస్తూ, తెలుగు భాష పరిరక్షణకు టాంటెక్స్ వారి సాహిత్య వేదిక చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ ప్రసాద్ తోటకూర, ఇతర వ్యవస్థాపక సభ్యుల కృషిని ఆయన అభినందించారు.

దేవులపల్లి కృష్ణ శాస్త్రి స్పృశించిన రచనా ప్రక్రియలన్నింటిని విభిన్న కోణాల నుండి అవలోకిస్తూ, వాటిలోని రచనా సౌందర్యాన్ని, పదలాలిత్యాన్ని, భావసౌకుమార్యాన్ని ఆవిడ సోదాహరణంగా విశ్లేషించారు. దేవులపల్లి ప్రసిద్ధ రచన 'కృష్ణ పక్షం' కవితల్ని ఊహా ప్రేయసి, ఆత్మాశ్రయతత్వం, వేదన ప్రకృతి, విరహం, పదాల లయబద్ధమైన తూగు కలయింపుగా వర్ణిస్తూ నిర్మలాదేవి గారు వివరించిన తీరు శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. దేవులపల్లి రాసిన లలిత గీతాలు, భక్తి గీతాలు, సినీ గీతాల్లోని సాహితీ విలువలని ఆవిడ రమ్యంగా వర్ణించారు. అంతే కాకుండా, కృష్ణ శాస్త్రి రచనల మీద పరిశోధనా సిద్ధాంత వ్యాసం సమర్పించి డాక్టరేట్ పట్టా పొందిన నిర్మలాదేవి ఆయనతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన వ్యక్తిత్వాన్ని విశదీకరించారు. కృష్ణ శాస్త్రిలో దాగున్న హాస్య చతురతని ఆయన రచించిన కథానికలతో సోదాహరణంగా వివరించి ఆవిడ ఆహూతుల్ని రంజింప జేశారు.

వేదిక సభ్యులు నందివాడ ఉదయభాస్కర్ డాక్టర్ నరసింహమూర్తి గారు తమ కవితల్ని, పద్యాల్ని చదివి వినిపించగా, జువ్వాడి రమణ సిరివెన్నెల సినీ గీతాల్ని ఆలపిస్తూ వాటి సాహితీ సౌందర్యాన్ని శ్రోతలతో పంచుకున్నారు. ఆచార్య పూదూర్ జగదీశ్వరన్ తరిగొండ వేంకమాంబ జీవిత చరిత్రను క్లుప్తంగా వినిపించారు. శ్రీమతి శాంత పులిగండ్ల, శ్రీమతి లక్ష్మీ సూరిభొట్ల కీర్తనలను ఆలపించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి ఒక వేణువు వినిపించెను అంటూ ఒక శ్రావ్య గీతాన్ని పాడి శ్రోతల్ని పరవశింపచేశారు.

కార్యక్రమంలో భాగంగా నిర్మలాదేవి గారితో వేదిక సభ్యులు చర్చ నిర్వహించారు. చివరిగా, అధ్యాపకురాలిగా, సంగీత రూపకం, బుర్రకథ,, యక్షగానం, నాటకం, వ్యాసాల వంటి రచనా ప్రక్రియల ద్వారా తెలుగు భాషకు ఎనలేని సేవ చేస్తున్న డాక్టర్ నిడమర్తి నిర్మలా దేవిని ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం అధ్యక్షురాలు శ్యామ రుమాళ్ళ పుష్పగుచ్ఛంతో, న్యూజెర్సీ అసెంబ్లీ సభ్యుడు చివుకుల ఉపేంద్ర జ్ఞాపికతో సత్కరించారు. అన్నపూర్ణ చిలుకూరు, శాంత పులిగండ్ల, అత్తలూరి విజయలక్ష్మి, శ్యామ రుమాళ్ళ, ఆచార్య జగదీశ్వరన్, చంద్రశేఖర్ కన్నెగంటి, పులిగండ్ల విశ్వనాథం, ఎం. వి. ఎల్. ప్రసాద్, రాజారెడ్డి, అనంత్ మల్లవరపు, సురేష్ మండువ, డాక్టర్ కృష్ణబాబు చుండూరి, డాక్టర్ వేముల నరసింహారావ్, తదితరులు పాల్గొన్న ఈ సభ కె.సి. చేకూరి వందన సమర్పణతో ముగిసింది.